# మిసెస్ పరాంకుశం

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



### 1971 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన రెండవ నవల

*(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)*

9

సుఖవ్యాధుల డాక్టర్ పరాంకుశానికి ఆఫీస్‌కి టెలిఫోన్ చేసి సాయంత్రం ఓసారి రమ్మని చెప్పాడు.

ఆఫీసు నుంచి తిన్నగా పరాంకుశం డాక్టర్ దగ్గరకి వెళ్ళాడు.

"ఎలా ఉంది మీ సంసారం?" అడిగాడు డాక్టర్.

"అభివృద్ధి ఉంది." తృప్తిగా చెప్పాడు.

"కోర్స్ పూర్తయింది. సౌదామిని ఇప్పుడు పూర్తిగా ఆరోగ్యవంతురాలు. ఆమె లేటెస్ట్ బ్లడ్ రిపోర్ట్ నార్మల్‌గా ఉంది."

"థాంక్స్ డాక్టర్."

"నర్స్ చెప్పింది. చాలా మారిందని. మొత్తానికి మీ అక్కా తమ్ముళ్ళిద్దరూ అసాధ్యులే."

"థాంక్స్ డాక్టర్. బిల్లు ఇస్తే మీకు ఫీజు పే చేస్తాను."

"దేనికి ఫీజు?" నవ్వుతూ అడిగాడు డాక్టర్.

"ట్రీట్ మెంట్‌కి."

"ఏం ఇవ్వక్కరలేదు. అసలు ఇలా మంచి మార్గాన పడ్డ పేషెంట్స్ దొరకడం అరుదు. అలాంటి వాళ్ళకి ట్రీట్ చెయ్యాలనిపిస్తుంది నాకు. పక్క గదిలో ఓ లక్షాధికారి ముద్దుల కొడుకు కూర్చుని ఉన్నాడు. సిఫిలిస్ ట్రీట్ మెంట్ కోసం వచ్చాడు. అలాంటివాళ్ళ దగ్గర ఫీజు తీసుకుంటే అందం."

పావుగంట తరువాత ఇంటిదారి పట్టాడు పరాంకుశం,

"ఏమండీ."

ఓ ఇంట్లోంచి పిలిచారు. ఎవరో. ఆడగొంతు, ఆగి చూసాడు పరాంకుశం.

గుమ్మం దగ్గర నిలబడి ఉంది ఒకామె. తెల్లటి చీర. తలనిండా మల్లెపూలు.

"నన్నేనా?" అడిగాడు.

"అవును. చిన్న సహాయం చేస్తారా?" అడిగింది.

"ఏం సహాయం?"

ఇల్లాలి లక్షణాలున్న ఆమె వంక అనుమానంగా చూస్తూ అడిగాడు పరాంకుశం.

"ఫ్యూజ్ పోయినట్లుంది. ఇంట్లో దీపాలు వెలగడం లేదు. కొద్దిగా ఫ్యూజ్ పోయిందేమో చూసి వేస్తారా?" అడిగింది.

కొత్త వ్యక్తిని పిలవగల ఆమె ధైర్యానికి అబ్బురపడ్డాడు పరాంకుశం.

"మీరేం కొత్తవారు కాదు. పరాంకుశం కదా మీరు?" అడిగింది ఆమె, పరాంకుశం సంశయం గమనించి.

"అవును."

వరండా దాటి ముందు గదిలో ఉన్న ఎలక్ట్రిక్ మెయిన్ స్విచ్ దగ్గరకి వెళ్ళి ఫ్యూజ్ తీసి చూసాడు. నిజంగానే పోయింది ఫ్యూజ్. ఫ్యూజ్ మారుస్తూ అడిగాడు పరాంకుశం.

"నేనెలా తెలుసు మీకు?"

"నేనూ, మా వారూ మీ పెళ్ళికి వచ్చాం. మరచిపోయారా? గాంధీ బొమ్మ ప్రెజంట్ చేశాం కూడా. మావారు, మీరు కొలీగ్స్. ఆయన కేంప్‌కి వెళ్ళారు."

ఎవరు ప్రెజంట్ చేసింది మర్చిపోయినా, తన గదిలో టేబుల్ మీది గాంధీ బొమ్మ గుర్తుకు వచ్చింది పరాంకుశానికి.

రాగి తీగతో ఫ్యూజ్ మార్చాడు. తిరిగి యథాస్థానంలో పెట్టి లైట్లు వేశాడు. వెలిగాయి.

ఆవిడ వంక చూశాడు. ముప్పైలోపే ఉంటాయి. తెల్లగా, కొంచెం లావుగా అందంగానె ఉంది. జారిపోయి ఉంది పైట. ఎత్తయిన తెల్లటి శాటిన్ జాకెట్ కనబడుతూంది. గమనించనట్లుగా ఆమె పైటని సర్దుకోలేదు.

"ఉంటాను" బయటకు నడిచాడు పరాంకుశం.

"సమయానికి వచ్చారు. లేకపోతే రాత్రికి ఇబ్బంది పడేదాన్ని. ఆయన ఈ రాత్రికి రారు. థాంక్స్"

"ఫర్వాలేదు."

వీధి గుమ్మం దాటి పదిగజాల దూరం వచ్చాక పరాంకుశం బుర్రలో ఏదో తళుక్కుమంది. ఆగి వెనక్కి తిరిగి మళ్ళీ గుమ్మం దాటి లోపలికి వెళ్ళాడు.

కుర్చీలో కూర్చుని ఏదో చదువుతోంది ఆమె. పరాంకుశాన్ని చూసి తత్తరపడుతూ ఆ పుస్తకాన్ని చూసి తత్తరపడుతూ ఆ పుస్తకాన్ని మూసింది.

"మీరు బాగుంటారు" చెప్పాడు చిన్నగా నవ్వి.

చిన్నగా నవ్వింది.

"థాంక్స్. ఈ దారిలో వెళ్ళే నిన్ను చాలాకాలంగా చూస్తున్నాను. నీ మీద మనసు పడ్డాను. లక్కీగా మా వారు లేనప్పుడు ఇవాళ దొరికావు. రా." నిర్భయంగా చెప్పిందామె. పరాంకుశాన్ని చుట్టుకుపోయి మైమరపు నటిస్తూ.

పరాంకుశం ఆమెనుంచి దూరంగా జరిగి చెప్పాడు.

"ఇంకెప్పుడూ మీ ఆయన లేనప్పుడు అలాటి నెలనెలా వచ్చే చవక సెక్స్ సాహిత్యం కథలు చదవకండి."

వెనక్కి తిరిగి రోడ్డుమీదకి వచ్చి చెప్పాడు.

"ఇంకెప్పుడూ ఫ్యూజ్ పోగొట్టుకోకండి. జాగ్రత్తగా వాడండి దాన్ని."

ఆ రాత్రి జరిగింది సౌదామినికి చెప్పాడు పరాంకుశం.

"ఎందుకలా వదిలేసి వచ్చావు? అది పిరికితనం. మంచిది కాదు."

"క్షణికానందానికి ఆవిడ శీలం పాడుచెయ్యటం దేనికి?"

"మళ్ళీ మొదటికొచ్చావా? శీలం అంటే ఏమిటి?"

"నువ్వుండగా నాకు ఇంకొకళ్ళెందుకు? అనుకోవడమే శీలం. నేనీ పని ఆమెతో చేసి ఉంటే నీకు అసూయగా ఉండదా?" అడిగాడు సౌదామినిని దగ్గరకు తీసుకుని.

"అసూయంటే ఏమిటి?" ఎదురు ప్రశ్న వేసింది సౌదామిని.

***

సౌదామినికి ఇంగ్లీష్‌ని పరాంకుశమే నేర్పించాడు. రాయడం బాగా వచ్చేసింది. చిన్న చిన్న వాక్యాలు మాట్లాడుతుంది కూడా. పరాంకుశం అక్కయ్య తెలుగు నేర్పించింది. అదీ పూర్తిగా వచ్చింది. వివిధ పత్రికలు చదువుతుండటంతో అనేక టాపిక్స్‌లో విషయం పరిజ్ఞానం కూడా పెరిగింది.

సిగరెట్‌లాగా, మధ్యపానంలాగా, వ్యభిచారంలాగా, డ్రగ్స్‌లాగా చదవటం ఓ వ్యసనం. అది అలవాటయిన వాళ్ళు ఏది దొరికినా చదువుతారు. కొంతమంది అన్నం తింటూ పుస్తకం చదువుతారు. లేకపోతే ముద్ద మింగుడు పడదు. కొంతమందికి రాత్రి పుస్తకం చదివితే కాని నిద్రరాదు.

సౌదామిని ఏ పుస్తకం కనబడితే అది చదువుతుంది. పరాంకుశం లైబ్రరీ నుంచి మంచి పుస్తకాలు అనేక సబ్జెక్ట్స్ మీదవి ఏరి తెస్తున్నాడు.

కొత్త పుస్తకాలు చదువుతున్న కొద్దీ సౌదామినిలో లోకజ్ఞానం పెరుగుతోంది. లోకం అంటే ఏమిటో తెలిసిన దగ్గరనుంచి, తన పాత స్థితి, కొత్త స్థితి గుర్తుకువచ్చి ఎంతో సంతోషం కలుగుతోంది.

***

పరాంకుశం పెళ్ళయి ఎనిమిది నెలలయింది. పరాంకుశం బావ ట్రెయినింగ్ కోసం ఢిల్లీ వెళ్ళాడు. ఈ ఎనిమిది నెలలూ ఢిల్లీలోనే ఉన్నాడు. ట్రయినింగ్ వారంలో అయిపోతుందనీ, వీలయితే భార్యని ఇంటికి పంపవలసిందని ఆయన పరాంకుశానికి ఢిల్లీ నుంచి ఉత్తరం వ్రాసాడు.

పరాంకుశం బావకి అన్ని సంగతులూ ఈ ఎనిమిది నెలలుగా ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు.

"వెళ్ళనా. ఉండనా?" అడిగింది పరాంకుశం అక్కయ్య పరాంకుశాన్ని.

"వెళ్ళటమే భావ్యం. బావ కూడా ఎనిమిది నెలల నుంచీ నిన్ను వదిలే ఉన్నారు. అసలు ఈ ట్రయినింగ్ కూడా నువ్వు ఉండవనే వేయించుకున్నారు."

"వెళ్ళండి. ఫర్వాలేదు. నేను చూసుకోగలను." చెప్పింది సౌదామిని.

"మరి మీ సంగతి?" అడిగింది తమ్ముణ్ణి.

"అవసరం వస్తే ఉత్తరం రాస్తాను, లేదా వచ్చి పిలుచుకు వెళతాను."

"సరే అయితే."

పరాంకుశం అక్కయ్యకి కూడా భర్తమీదకి, ఇంటి మీదకి మనసు లాగుతోందని రెండు నెలల క్రితమే గ్రహించాడు పరాంకుశం.

ఆ సాయంత్రం సౌదామిని వినకుండా రహస్యంగా అడిగింది పరాంకుశం అక్కయ్య తమ్ముణ్ణి.

"వెళ్ళమంటావా? నువ్వు ఆఫీస్‌కు వెళితే ఇంట్లో ఎవరూ ఉండరు. సౌదామిని ఒక్కతే ఉంటుంది. మరో నెల ఉండమంటే ఉంటాను పోనీ."

"అవసరంలేదు, తరవాతయినా వెళ్ళవలసిందేగా నువ్వు. సౌదామినిలో కూడా బాగా మార్పు వచ్చింది."

"ఇంటికెళ్ళినా నా మనసంతా ఇక్కడే ఉంటుంది."

చిన్నగా నవ్వాడు పరాంకుశం.

"సౌదామినికి తన పాత జీవితం రోతని బాగా అర్థమైందన్న పూర్తి నమ్మకం నాకు వచ్చింది. కాబట్టి నేను వెళ్ళినా ఇబ్బంది ఉంటుందనుకోను." చెప్పిందామె.

అక్కయ్యకి వెయ్యి రూపాయలు ఇచ్చి నచ్చిన చీర, జాకెట్‌ని, బావగారికి బట్టలని కొనమని కోరాడు.

"పొదుపు చేసి దీంట్లో ఇంక మిగల్చక. మంచివి కొను." చెప్పాడు

సౌదామినితో షాపుకి వెళ్ళి కొని తెచ్చిన బట్టలని సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన తమ్ముడికి చూపించింది. తను సౌదామినికి, పరాంకుశానికి కొన్న దుస్తులని కూడా చూపించింది.

"మాకెందుకు కొన్నావ్? ఇస్తి వాయనం, పుచ్చుకుంటి వాయనం చేసావే?" నొచ్చుకుంటూ అడిగాడు పరాంకుశం.

"నా సంతోషం ఇది."

## 10

"ఎవరు మీరు?" అడిగింది సౌదామిని. ఎదురుగా ఉన్న ఓ నలభై ఏళ్ళతన్ని చూసి.

"ఇంటివాళ్ళ అబ్బాయిని. ఈ నెల అద్దె తీసుకు వెళదామని వచ్చాను."

"వారు ప్రతినెలా ఆఫీస్ నుంచి జీతం తెచ్చేటప్పుడే దారిలో ఆగి ఇస్తున్నారే? వారు రాగానే అడుగుతాను."

"వారెవరు?"

"మా ఆయన."

"సౌదామినా నీ పేరు?"

"గౌరవం ఇచ్చిపుచ్చుకోవడం తెలీదనుకుంటా మీకు?" కోపంగా అడిగింది సౌదామిని.

"నీ సంగతి విన్నాలే. ఎంత నీ రేటు ఎప్పుడు?"

"షటప్."

ఆ మాటలు విని చాలా నెలలవడంతో కంఠం కోపంతో వణికింది. ఒకానొకప్పుడు అలా వెకలిగా నవ్వుతూ రేటు అడిగితే తప్పుగా తోచేది కాదు. సంతోషంగా జవాబు చెప్పేది.

జేబులోంచి పదిరూపాయల కట్ట తీసాడతను. అన్నీ సరికొత్త నోట్లు. సౌదామిని కళ్ళముందు ఆడిస్తూ అన్నాడు.

"వెయ్యి రూపాయలు. ఆలోచించుకో."

"గెటౌట్."

"గుర్తు లేనా? ఇదివరకు నీ దగ్గరకి చాలాసార్లు వచ్చి వెళ్ళిన వాడినేగా. వేషం భాష మారింది. రేటు పెరిగుండవచ్చు. పదినిమిషాల పనికి వెయ్యి. నీ పేరులోనే నీ రేటుంది తెలుసా? మీ వాళ్ళు నీ పేరు బాగా ఆలోచించే పెట్టారు. సౌ అంటే వంద. దా అంటే రా. సౌదా అంటే వందకి వచ్చేదని అర్థం. నీ పేరు సౌదామిని. మిని కాని. మని. మని. ఇంత మని" ఆశ పెడుతూ చెప్పాడు.

తనని అలా నీచంగా మాట్లాడటం వల్ల అప్రయత్నంగా సౌదామిని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"గెటౌట్ ఐ సే." ఉగ్రంగా అరుస్తూ, కాళికాదేవిలా పక్కనే ఉన్న బూజు దులిపే కర్ర అందుకుంది సౌదామిని.

అతను డబ్బు జేబులో దోపుకుని ఖంగారుగా పరిగెత్తాడు. పరాంకుశం ఆఫీసు నుంచి తిరిగి వచేటప్పటికి సౌదామిని పేము కుర్చీలో కూర్చుని కనపడింది.

"ఏమిటి అలా ఉన్నావు?" అడిగాడు ఆత్రంగా.

"ఇంటివాళ్ళ అబ్బాయట, తుంటరి వెధవ. డబ్బు తెచ్చి నన్ను నీచంగా మాట్లాడాడు. ఆ వెధవ నన్ను గురించి ఏమనుకుంటున్నాడో. వెంటనే ఖాళీ చేద్దాం ఈ ఇల్లు."

"ఇంటి వాళ్ళ అబ్బాయా? ఏమన్నాడు?" అడిగాడు పరాంకుశం మండిపడుతూ.

"వెయ్యిరూపాయలిస్తానన్నాడు."

"అక్కయ్యేది?"

"కూరలకి వెళ్ళింది."

"డామిట్! ఈసారి రానీ వాడి పని చెపుతాను."

కాసేపాగి అడిగాడు.

"ఏం? ఒప్పుకోలేదేం? వెయ్యి రూపాయలు నీకు చేదా?"

"అంటే నీ ఉద్దేశం?"

కుర్చీలోంచి తోక తొక్కిన తాచులా లేచింది సౌదామిని.

"అహ కూర్చో, ఏం లేదు."

"నువ్వు అనుకున్నంత నీచురాల్ని కాదు నేను. ఒకప్పుడు వేశ్యనే. ఇప్పుడేం కాదు! మానసికంగా ఇప్పటికీ వేశ్యనే నేను. 'శీలం' అంటే విలువలేదు నాకు. మరొకరితో పోయినా తప్పు లేదు నా దృష్టిలో. కాని, చూస్తూ చూస్తూ మళ్ళీ ఆ పని చెయ్యలేను."

"ఏం?"

"నీ మంచితనం వల్ల. నీకోసం."

పరాంకుశం చేతిని తన చేతుల్లోకి తీసుకుని చెప్పింది సౌదామిని.

"ఈనాడు నేను ఈ స్థితిలో ఉన్నానంటే దానికి కారణం నువ్వు. అందుకు కృతజ్ఞురాలిగా ఉండాలి. అది నా కర్తవ్యం. లేకపోతే నేను ఎందుకూ పనికిరానిదాన్ని అయిపోతాను. నువ్వు పడ్డ కష్టం అంతా వృధా అయిపోతుంది. నాకు నమ్మకం లేకపోయినా, శీలం మీద మీకు నమ్మకం ఎక్కువ. నీకోసం నేనూ నమ్మకం ఏర్పరచుకోకపోయినా ఆ శీలాన్ని మాత్రం కాపాడుకుంటాను. ముఖ్యంగా మన పెళ్ళయ్యాక నువ్వు నీ శీలాన్ని భగ్నపరచలేదు. రెండు మూడు అవకాశాలొచ్చినా. ఆ గాంధీ బొమ్మ ప్రెజంట్ చేసినావిడ విషయంలోగాని, అమ్మాజీ విషయంలోగానీ. అందుకనే నువ్వంటే నాకు గౌరవం."

"గుడ్"

"కాని, నువ్వు మాత్రం తప్పుదారి తొక్కావో, నేను మళ్ళీ మామూలు సౌదామినిని అయిపోతాను." హెచ్చరికగా చెప్పింది.

"సౌదామినీ! నీ దగ్గర నాకు దొరకనిది, బయట వాళ్ళ దగ్గర దొరికేది అంటూ ఏమి ఉండదు. నువ్వుండగా నాకింకెవ్వరూ అక్కరలేదు." చెప్పాడు ఆమెని దగ్గరకి లాక్కుని.

తృప్తిగా నవ్వింది సౌదామిని.

కూరలకోసం దుకాణానికి వెళ్ళి అరగంట తర్వాత వచ్చిన తన ఆడపడుచుకి చెప్పింది సౌదామిని.

సాయంత్రం సౌదామిని, పరాంకుశం గుర్రబ్బండిలో తీసుకువెళ్ళి దిగబెట్టారు పరాంకుశం అక్కయ్యని బస్‌స్టాండ్‌లో. బస్సు కదిలేదాకా ముగ్గురూ మాట్లాడుకుంటూనే ఉన్నారు. దంపతులిద్దర్నీ తమ ఊరికి ఆహ్వానించిందామె.

"మేమిద్దరం వస్తాం త్వరలో." చెప్పింది సౌదామిని.

"సౌదా. నేను చెప్పినదంతా గుర్తుందిగా?" సౌదామిని చేతిని పట్టుకుని అడిగింది.

"గుర్తుంది. నానించి ఎవరికీ ఏం భయం అక్కర్లేదు." ధైర్యం చెప్పింది సౌదామిని.

డ్రయివర్ బస్‌ని స్టార్ట్ చేసాడు.

బస్సు కదలగానే అనుకోకుండా ముగ్గురికీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అనుకుంది పరాంకుశం అక్కయ్య 'ఈ ఎనిమిది నెలల కష్టానికి ఫలితం దక్కింది.'

పరాంకుశం అక్కయ్య వెళ్ళబోయే ముందు, సౌదామినిని నమ్మి ఇంట్లో ఎవరి దక్షతా లేకుండా ఒంటరిగా వదలవచ్చా అన్న సంశయం అక్కా తమ్ముళ్ళిద్దరినీ బాధించింది. సౌదామినిలో కొంచమయినా మంచి మార్పు వచ్చిందా, లేక ఇదివరకటిలాగానే ఉందా అన్న సంగతి ఇద్దరికీ రూఢీగా తెలియదు. ఆ విషయం మీద అక్కా తమ్ముళ్ళు తీవ్రంగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చారు.

సౌదామిని మనస్తత్వం, ఆమెలోని మార్పు కనుక్కోవటానికి శ్రీకంఠం స్నేహితుడిని ఒకడిని బాగా నమ్మకస్తుడైన వాడిని ఇంటివాళ్ళబ్బాయిగా వెళ్ళి సౌదామినిని పరీక్షించేందుకు నాటకం ఆడమని పరాంకుశం పంపాడు. సౌదామిని వెయ్యిరూపాయలకి లొంగిపోతానంటే ఆ సంగతి వచ్చి అతను చెప్పాక ఏం చెయ్యాలన్న సంగతి ఆ తర్వాత నిర్ణయించుకోవాలని అనుకున్నారు.

సౌదామినిలోని మంచి మార్పు చూసి పరాంకుశం ఇక తను నిశ్చింతగా ఉండవచ్చనుకున్నాడు. తన దగ్గరికి వెయ్యి రూపాయలతో వచ్చినతను ఇంటివాళ్ళబ్బాయి కాదనీ, పరాంకుశమే తనని పరీక్షించడానికి పంపాడన్న సంగతి సౌదామినికి తెలియదు. తెలిసిన నలుగురూ ఆ విషయం ఆమెకి ఎన్నడూ చెప్పరు.

బస్ కదిలాక ఇద్దరూ హోటల్‌కి వెళ్ళి భోజనం చేసి ఇంటికి బయలు దేరారు. వాళ్ళ వివాహానంతరం ఆ హోటల్‌లోనే పరాంకుశం తన మేరేజ్ రిసెప్షన్‌ని ఏర్పాటుచేసింది.

రిక్షాలో ఇంటికి తిరిగి వస్తుంటే కొద్దిగా సిగ్గుపడుతూ పరాంకుశానికి చెప్పింది సౌదామిని.

"ఎనిమిది నెలల క్రితం నేనెంత పిచ్చిదాన్ని. ఆ రోజు హోటల్‌లోని సర్వర్‌తో ఎలా సిగ్గులేకుండా మాట్లాడగలిగానా అనిపిస్తోంది ఇప్పుడు."

అది ఆమెలోని మార్పుకి గుర్తుగా భావించాడు పరాంకుశం.

✷✷✷

పరాంకుశం శ్రీకంఠాన్ని తన అక్కయ్య వెళ్ళిన ఆదివారం భోజనానికి ఆహ్వానించాడు.

"నీ ఆహ్వానం కోసమే ఎదురు చూస్తున్నాను." చెప్పాడు శ్రీకంఠం

"నువ్వు ఎదురుచూడాలా? ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడే వచ్చి ఉండవలసింది." చెప్పాడు పరాంకుశం.

"ఓ కారణంగా నా అంతట నేను మానేసాగా. మళ్ళీ నా అంతట నాకే రాబుద్ధికాలేదు." నవ్వాడు శ్రీకంఠం.

"నేను కూడా ఇంతదాకా ఎవరినీ పిలవలేదు, నిన్నే మొట్టమొదటిసారి పిలవడం."

"థాంక్స్"

"మా ఆవిడ వంట ఎలా ఉందో నువ్వే చెప్పాలి."

శ్రీకంఠం ఆదివారం ఉదయం వచ్చాడు పరాంకుశం ఇంటికి.

"నమస్తే. రండి వారు లోపల స్నానం చేస్తున్నారు." ఆహ్వానిస్తూ చెప్పింది సౌదామిని.

ఎదురుగా నిలుచుని ఉన్న సౌదామినిని చూసి శ్రీకంఠం తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు.

ఆ నడకలో ఇదివరకటి హొయలు లేవు. ఆ కళ్ళలో రెచ్చగొట్టే చూపులేదు. ఆ నవ్వులో వెకిలితనం లేదు. ఆ దుస్తుల తీరులో అర్ధనగ్నత లేదు. ఆ మాటల్లో అశ్లీలత లేదు. ఆ ఆకారంలో, అసలా మనిషిలోనే అసభ్యత లేదు.

శ్రీకంఠం పేము కుర్చీలో కూర్చునాడు. మంచి నీళ్ళ గ్లాసు అందించి చెప్పింది.

"పత్రిక చూస్తుండండి. ఇప్పుడే వస్తాను."

చేతిలోని ఎంబ్రాయిడరీ కుటే రింగ్‌ని టేబుల్ మీద పెట్టి లోపలికి వెళ్ళిపోయింది సౌదామిని.

ఇల్లాలులా ఉంది సౌదామిని. వెలయాలులా కాదు.

అయిదు నిమిషాల తరువాత కాఫీ ట్రేతో వచ్చింది.

"చక్కెర డబ్బా తెచ్చాను. ఎంత కావాలో వేసుకోండి. నాకు తెలియదు మీరు ఎంత వేసుకుంటారో."

ట్రేలోని మంచినీళ్ళ గ్లాసులు, కాఫీ కప్పులు టేబుల్ మీద పెట్టింది సౌదామిని.

"ఎందుకండీ శ్రమ?" ఇబ్బందిగా అన్నాడు శ్రీకంఠం.

"శ్రమేమీ లేదు, చాలా నెలల తరువాత వచ్చారు."

శ్రీకంఠం కాఫీ తాగుతుంటే పరాంకుశం వచ్చాడు.

సౌదామిని భోజనాలు వడ్డించడానికి పక్కగదిలోకి వెళ్ళాక రహస్యమా చెప్పాడు శ్రీకంఠం.

"మై హెవెన్స్! బాగా మార్చాసావే?"

గర్వంగా నవ్వాడు పరాంకుశం.

"ఇంకా మార్చాల్సింది కొంత మిగిలి ఉంది" చెప్పాడు.

"నూటికి నూరుపాళ్ళు మార్చేసావ్. హేట్సాఫ్. ఇలాంటి అమ్మాయి నీకు ఎక్కడా దొరకదు. అమ్మాజీ కన్నా బెటర్ ఛాయిస్ సౌదామిని."

వడ్డించేప్పుడు శ్రీకంఠాన్ని అడిగింది సౌదామిని.

"మీకు తెలిసినవాళ్ళ దగ్గర ఎక్కడైనా మంచి డిజైన్ కోసం చూస్తున్నాను." అడిగింది.

"అలాగే."

సాయంత్రం సౌదామినిని, పరాంకుశాన్ని సినిమాకు తీసుకెళ్ళాడు శ్రీకంఠం.

సినిమాలో ఎవరో పరాంకుశాన్ని పేరు పెట్టి పిలిచారు.

ఆడగొంతు!

పరాంకుశం తలని వెనక్కి తిప్పి చూసాడు.

అమ్మాజీ!

"హలో! కులాసా?" అడిగాడు నవ్వుతూ.

తల ఊపింది.

లైట్లు ఆర్పేసారు. సినిమా మొదలింది. ఇంటర్వెల్‌లో నలుగురూ బయటికి నడిచారు.

"ఎలా ఉంది మీ సంసారం?" అడిగింది అమ్మాజీ.

"బాగానే ఉంది. ఓసారి మా ఇంటికి మీ పేరెంట్స్‌ని తీసుకునిరా." ఆహ్వానించాడు.

సౌదామినిని పరిచయం చేసాడు. అమ్మాజీ సౌదామిని వంక గుడ్లప్పగించి చూస్తుండిపోయింది కాస్సేపు.

తెల్లటి చీర, తలలో ఒకే ఒక్క ఎర్రటి రోజా. కుడిచేతికి రిస్ట్‌వాచీ, ఎడమ చేతికో బంగారు గాజు. అమాయకంగా ఉన్న మొహం. మిసమిసలాడుతూ, పచ్చగా, ఆరోగ్యంగా ఉంది.

సౌదామిని ఒకప్పుడు వేశ్య అంటే నమ్మేట్టుగాలేదని మనసులో అనుకుంది అమ్మాజీ.

"మా పెళ్ళికి రాలేదే మీరు?" అడిగింది సౌదామిని.

ఎవరు వచ్చిందీ, ఎవరు రానిదీ సౌదామినికి గుర్తులేదు. ఆమె వచ్చిందో, రాలేదో కనుక్కుందామని ఊరికే ఆసక్తిగా అడిగింది.

"కుదరలేదు."

"పంపలేదు ఇంట్లో కదా?" అడిగాడు పరాంకుశం నవ్వి.

"అవును" జవాబు చెప్పింది నవ్వి.

"అప్పుడప్పుడూ మా ఇంటికి వస్తుండండి." ఆహ్వానించింది సౌదామిని.

"తప్పకుండా, మీరిలా ఉంటారని తెలిస్తే ఎప్పుడో వచ్చేదాన్ని."

"దొంగా. నీ పెళ్ళికి నన్ను పిలవలేదే?" అడిగాడు పరాంకుశం ఎత్తుగా ఉన్న ఆమె కడుపుని చూసి.

వెంటనే తల వంచుకుని చెప్పింది అమ్మాజీ.

"కాలేదింకా."

"మరి?"

"నాలుగో నెల."

"గుడ్ గాడ్! ఎలా మరి?"

"పెళ్ళి చేసుకుంటానని ఒకడు మోసం చేసాడు. నా క్లాస్‌మేట్ అన్నయ్య."

"డర్టీ రాస్కెల్."

"ఇప్పుడు అర్థం అవుతోంది మీ మంచితనం. ఆ గదిలో ఉన్నప్పుడు మీరు ఎంత దూరంగా, ఎంత మంచిగా ఉండేవారో. అప్పుడప్పుడు అమ్మా, నాన్నా అదే అనుకుంటూ ఉంటారు."

"మరి ఎలా ఇప్పుడు? నీ సంగతి అందరికీ తెలిసి పోలేదా?"

"నాన్న కోర్టులో కేసు పెడతానంటున్నారు. సాక్ష్యం ఉంది. నా కైతే ఇష్టంలేదు."

"అది మంచిదా? కోర్టు తీర్పుతో అతను కాపురం చేస్తాడా?"

"అవును. బలవంతంగా అతనితో కాపురం చేయించటం కష్టమే. ఆ గ్రహింపు అతనికి ఉండాలి, అన్యాయం చేయకూడదని. అబార్షన్ మా పేరెంట్స్‌కి ఇష్టం లేదు. ఆ టైం కూడా దాటిపోయింది. నేను ముందే చెప్పకుండా దాచాను. రేపు ఊరు వెళుతున్నాను, పురుడు పోసుకుని వస్తాను" మళ్ళీ చెప్పింది అమ్మాజీ.

"అమాయకులైన అమ్మాయిల జీవితాల్ని నాశనం చేసే డర్టీ బాస్టర్డ్స్ చాలామంది ఉంటారు లోకంలో." చెప్పాడు పరాంకుశం బాధ పడుతున్నట్లుగా.

లైట్లు ఆరిపోయాయి. మళ్ళీ సినిమా మొదలైంది. నలుగురూ హాల్లోకి వెళ్ళిపోయారు.

పరాంకుశం మరో స్త్రీతో తన ముందు మాట్లాడటం చూడటం సౌదామినికి అదే మొదటిసారి, ఆ మొట్టమొదటి అనుభవంతో సౌదామినిలో 'ఈర్ష్య' ప్రవేశించింది.

"అసూయ అంటే ఏమిటో నాకూ ఇవాళ అర్థమైంది." ఇంటికి వెళుతూ చెప్పింది సౌదామిని తన భర్తతో.

✷✷✷

*(తరువాయి భాగం వచ్చే సంచికలో)*

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..

Click here to go to KOUMUDI Library

